క్లుప్తంగా

తానాం రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

పరవాడ: తానాం రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఐఐఐటీకి ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు చెప్పారు. జూనియర్ కళాశాలకు చెందిన పి.దివ్య(586), ఎస్.ఝాన్సీ(583), కె.హరిత(578), జి.సాయి సంజన(580), ఆర్.జోత్స్న(577), కె.మేఘన(565), డి.తనూజ(571) మార్కులు సాధించి ఐఐఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ అప్పలనాయుడు తెలిపారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



ఏఈవో నరసింగరావుకు చెక్కులందజేస్తున్న దాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరానికి చెందిన బి.శ్రీనివాసరెడ్డి దాత లక్ష 1116, మాధవధార ప్రాంతానికి చెందిన కె.అన్నయ్య అనే దాత లక్ష 16 రూపాయల విరాళం ఇచ్చారు. సింహగిరిపై అన్నప్రసాద భవనంలో ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు సంబంధిత చెక్కులు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించారు. అనంతరం ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందజేశారు.

వెంకటాద్రి.. ఆధ్యాత్మిక ఝరి



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం బాలభోగం నివేదించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద, మజ్జిగ వితరణ చేపట్టారు.

లీజుదారుడికి షోకాజ్ నోటీస్

పరవాడ: తాడి క్వారీలో అక్రమ తవ్వకాలపై గనులు భూగర్భ శాఖ అధికారులు స్పందించారు. 'ఉల్లంఘనుడిపై చర్యలు తీసుకోవాలి' అంటూ 'సాక్షి' దినపత్రికలో ఈ నెల 13న ప్రచురితమైన కథనానికి అనకాపల్లి జిల్లా గనులు, భూగర్భ శాఖ ఏడీ సుబ్బారాయుడు స్పందించారు. తాడి క్వారీలో లీజుకు తీసుకున్న ప్రాంతం కాకుండా వెలుపల జరిపిన గ్రావెల్ తవ్వకాలు, రవాణా శాఖ ఫారాలు దుర్వినియోగంపై వివరణ ఇవ్వాలని లీజుదారు కె.లక్ష్మికి షోకాజ్ నోటీసు జారీ చేశామని చెప్పారు. షోకాజ్ నోటీసుకు వివరణ ఇవ్వని పక్షంలో అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా అవసరమైన చర్యలు తీసుకొంటామని ఆ నోటీసులో పేర్కొన్నట్టు ఏడీ తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ఎటువంటి అక్రమ మట్టి తవ్వకాలు జరగకుండా రెవెన్యూ, పోలీస్ శాఖల సహకారంతో పర్యవేక్షిస్తున్నామని ఏడీ సుబ్బారాయుడు పేర్కొన్నారు.

నేడు 'ఉక్కు విలీన దీక్ష'

ఉక్కునగరం: ఉక్కు అధికారుల సంఘం (సీ) ఆధ్వర్యంలో ఆదివారం ఉక్కు విలీన దీక్ష చేయనున్నారు. ఉక్కు రంగాన్ని వ్యూహాత్మక రంగంలో ఉంచడానికి, సెయిల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ పునఃవిలీనానికి, పూర్తి సామర్థ్యంతో స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి చేయడానికి తక్షణ బెయిలౌట్ ప్యాకేజికి ఉక్కు అధికారుల సంఘం అభ్యర్థిస్తోంది. సీ భవన్ వద్ద ఆదివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు దీక్ష నిర్వహించనున్నారు.

ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ మద్దతు...

ఉక్కు విలీన దీక్షకు స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ తమ మద్దతు ప్రకటించింది. స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు సెయిల్ విలీనంతో ముడిపడి ఉన్నందున వెంటనే కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టాలని అసోసియేషన్ నాయకులు బి. తాడన్న, బయ్యే మల్లయ్య, ఎస్. సత్యనారాయణ డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు పట్టవా?

- బీఆర్టీఎస్ రోడ్డుపైనే వాహనాలు
- పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపైనే ఇలా వాహనాలు



బాజీ జంక్షన్‌లో భాష్యం స్కూల్ వద్ద బీఆర్టీఎస్ రోడ్డుపై విద్యార్థులు

విశాఖ విద్య: ఎస్‌ఏడీ సెంటర్‌లో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. ట్రాఫిక్ పోలీసులు నివారణ చర్యలు చేపడుతున్నప్పటికీ కొంతమంది కారణంగా సమస్య మళ్లీ మొదటికొస్తోంది. ఎస్‌ఏడీ ఫ్లై ఓవర్ నుంచి గోపాలపట్నం వెళ్లే దారిలో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అయితే బాజీ జంక్షన్‌లో వాహనాలు ముందుకు కదలడం లేదు. వాహనదారులు ట్రాఫిక్‌లోనే ఇరుక్కుపోతున్నారు.

ఇదీ పరిస్థితి

పెందుర్తి పరిసర ప్రాంతాల నుంచి ఎస్‌ఏడీ సెంటర్ మీదుగా నగరంలోకి వచ్చే వారంతా బీఆర్టీఎస్ రోడ్డుపైనే రావాలి. ఉద్యోగ, వ్యాపారాలు నిమిత్తం, అదే విధంగా వివిధ పనుల కోసం వచ్చే వారితో ఎస్‌ఏడీ సెంటర్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఇదిలా ఉంటే ఎస్‌ఏడీ సెంటర్‌లో ఎక్కువగా పాఠశాలలు, కాలేజీలు ఉండడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. పాఠశాలలు, కాలేజీలు విడిచే సమయంలో విద్యార్థులంతా ఒకే సారి రోడ్డుపైకి వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతోంది. మరి ముఖ్యంగా బీఆర్టీఎస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న పాఠశాలలు, కాలేజీల యాజమాన్యాల నిర్లక్ష్యం కారణంగా మరింత సమస్యగా మారింది. సాయంత్రం పాఠశాలలు, కాలేజీలు వదిలేటప్పుడు వందలాది మంది విద్యార్థులు ఒకే సారి రోడ్డుపైకి వచ్చేస్తున్నారు. దీంతో బీఆర్టీఎస్ రోడ్డుపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోతుంది. అదే సమయంలో వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఎక్కడ ప్రమాదానికి గురవుతారేమోనని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్కూళ్లు వదిలే సమయంలో క్రమ పద్ధతిలో విద్యార్థులను బయటకు పంపించేలా పాఠశాలల యాజమాన్యాలు శ్రద్ధ తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. పోలీసులు ఏదైనా ప్రమాదం సంభవించిన తర్వాత హడావుడి చేసే కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



బస్సు కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

సింహాచలేశుడికి వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేసి 1001 నామాలతో స్వామికి అర్చన చేశారు. భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

- అప్పన్నస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంచేయజేసి విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.
- సింహాచలేశుడికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేసి అష్టోత్తరంపూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.



అప్పన్న ఉత్సవమూర్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

నేడు జిల్లా యాదవ సంఘం ఆత్మీయ సమావేశం

మద్దిలపాలెం: ఉత్తరాంధ్ర జిల్లాల యాదవ సంఘం ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం సిరిపురం వుడా చిల్డ్రన్ ఎరినాలో నిర్వహించనున్నామని సంఘం జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణ యాదవ్ హాజరుకానున్నారన్నారు. ఇటీవల గెలుపొందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ శ్రీనివాస్‌లను సత్కరించనున్నామన్నారు. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ నర్సు రామారావు యాదవ్, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారన్నారు. సమావేశంలో జిల్లా యాదవ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పిలి అప్పలకొండ, ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ, నమ్మి వెంకట్, మొల్లి లక్ష్మణరావు, కార్యదర్శి డొక్కర శ్రీను, సారిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఒమ్మి సన్యాసిరావు

నేడు జిల్లా స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు

మురళీనగర్ : విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మురళీనగర్ వైశాఖి స్పోర్ట్సు పార్కులో నాల్గవ జిల్లా స్థాయి రోల్‌బాల్ పోటీలు ఆదివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతాయని వైశాఖి స్పోర్ట్సు పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ తెలిపారు. ఈ పోటీలకు నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చిని ముఖ్య అతిథిగా ఆహ్వానించామని చెప్పారు. విశాఖ రోల్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తోట లలిత ప్రియ పర్యవేక్షణలో ఈ పోటీలు నాలుగు విభాగాల్లో నిర్వహిస్తామన్నారు.

ఉద్యోగం, కుటుంబం రెండూ ముఖ్యమే..

- కష్టపడిన సిబ్బందికి గుర్తింపు
- సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి



పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించిన వారితో పోలీస్ కమిషనర్ శంఖబత్ర బాగ్చి, జేసీపీ ఫకీరప్ప

అల్లిపురం: పోలీస్ సిబ్బందికి ఉద్యోగం ఎంత ముఖ్యమో.. కుటుంబం కూడా అంతే ముఖ్యమని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి అన్నారు. కమిషనరేట్ పరిధిలో పదోన్నతులు పొందిన 17 సివిల్, ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లను శనివారం కమిషనరేట్ సమావేశ మందిరంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది విధి నిర్వహణతో పాటు కుటుంబాన్ని కూడా చూసుకోవాలన్నారు. కానిస్టేబుల్‌కు తన ఉద్యోగ జీవితంలో పదోన్నతి రావడం చాలా అరుదన్నారు. ఐపీఎస్‌లకు ప్రతి మూడేళ్లకు ఓసారి పదోన్నతి రావడం సహజమన్నారు. అదే సంతోషాన్ని కానిస్టేబుళ్లలో ఉండాలని భావించి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పదోన్నతి చెందిన కానిస్టేబుళ్లను వారి కుటుంబ సభ్యుల మధ్య సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. తన జీవితంలో ఇటువంటి కార్యక్రమానికి ఎప్పుడూ హాజరుకాలేదన్నారు. అనంతరం పదోన్నతులు పొందిన వారికి సీపీ, జేసీపీ కె.ఫకీరప్ప, ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను అందజేశారు.

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా..

గంజాయి రహిత వైజాగ్ లక్ష్యంగా పోలీస్ సిబ్బంది, నగర ప్రజలు, మీడియా కలసికట్టుగా పని చేయాలని సీపీ పిలుపునిచ్చారు. గంజాయి అమ్మేవారిని, సేవించే వారిని నగరం వదిలివెళ్లేలా చేద్దామన్నారు. ఇందు కోసం ఇప్పటికే నగరంలో అవసరమైన చోట సీసీ కెమెరాలు, చీకటి ప్రదేశాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. తన ఫోన్ నంబర్‌ను పబ్లిక్‌కు ఇచ్చానని, గంజాయి తాగిన వారు, అమ్మిన వారి సమాచారం వాటస్ప్/ఫోన్ ద్వారా తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జవాన్ మృతికి నివాళి



ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణిలో మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నేవీ సిబ్బంది



సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఆర్మీ సిబ్బంది

సింథియా: ఆర్మ్‌డ్ వర్క్‌షాపునకు చెందిన సీఎఫ్ఎన్ ర్యాంకర్ గొట్టపు శంకరరావు అంత్యక్రియలను శనివారం విజయనగరం జిల్లా బాడంగిలో అతని స్వగ్రామంలో సైనిక లాంఛనాలతో నిర్వహించారు. అంతకుముందు ఐఎన్‌హెచ్‌ఎస్ కల్యాణిలో శంకరరావు మృతదేహానికి తూర్పు నావికాదళం స్టేషన్ హెడ్క్వార్టర్స్ జిల్లా అధికారులు, నగర పోలీసులు నివాళులర్పించారు.

బ్రాహ్మణులకు 'టెట్'ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: టెట్‌కు హాజరయ్యే బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వైజాగ్ బ్రాహ్మణ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కావూరి చరణ్ కుమార్ తెలిపారు. శిక్షణకు వచ్చే అభ్యర్థులు పదో తరగతి, బీఈడీ, డీఈడీ, ఆధార్, జెరాక్స్ కాపీలను సమర్పించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 99625 99790 / 92466 25822 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

దళిత ఐపీఎస్ అధికారిపై కక్ష సాధింపు తగదు

అనకాపల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే దళిత ఏస్పీ పీవీ సునీల్‌కుమార్‌పై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం రాజ్యాంగానికి విరుద్ధమని అంబేడ్కర్ ఇండియా మిషన్ జిల్లా కార్యదర్శి గొంది అప్పారావు అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేసి, అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. గతంలో సీఐడీ డీజీగా విధులు నిర్వహించిన పీవీ సునీల్‌కుమార్‌పై రఘురామకృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదుతో తప్పుడు కేసు నమోదు చేయడం వెనుక ప్రభుత్వ కుట్ర ఉందని ఆరోపించిచారు. ఆయనపై నమోదు చేసిన కేసును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత సంఘం నేతలు

ట్రెజరీలో ప్రక్షాళన

- అంతర్గత బదిలీలు
- ఏటీవో,ఎస్‌టీవో, సీనియర్ అకౌంటెంట్లకు స్థానచలనం

మహారాణిపేట: పలు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా ట్రెజరీ కార్యాలయంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. వరుస వివాదాలకు కారణమవుతున్న వారిని బదిలీ చేశారు. ఏటీవో, ఎస్‌టీవో, సీనియర్ అకౌంటెంట్లు, జూనియర్ అకౌంటెంట్లను ట్రెజరీలో మరో విభాగానికి బదిలీ చేశారు. డబ్బులు ఇస్తే గానీ బిల్లులు చేయడం లేదని పలుశాఖల అధికారులు నేరుగా ట్రెజరీ శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు ఫిర్యాదు చేశారు. మోహన్‌రావు కూడా ఇటీవల ట్రెజరీ కార్యాలయంలో విచారణ చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వివిధ విభాగాలకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ బిల్లులు చేస్తున్న ట్రెజరీ ఉద్యోగుల మీద ఆరోపణలు వెల్లువగా వచ్చాయి. ఇప్పుడు ఆ విభాగానికి చెందిన అసిస్టెంటు ట్రెజరీ అధికారి (ఏటీవో) సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో), ఇద్దరు సీనియర్ అకౌంట్ ఆఫీసర్లను బదిలీ చేస్తూ జిల్లా ట్రెజరీ అధికారి యార్లగడ్డ సుధాకరరావు ఉత్తర్వులు జారీ చేశారు. మెడికల్ బిల్లులు చూసే అసిస్టెంట్ ట్రెజరీ అధికారి నాగార్జునను పోలీసు శాఖకు బదిలీ చేసి, పోలీసు శాఖలో బిల్లులు చూసే నితిన్ జోషిని మెడికల్ బిల్లులకు నియమించారు. గతంలో ఉండే ఇద్దరు సీనియర్ అకౌంటెంట్లను కూడా బదిలీ చేశారు.

తుప్పలు తొలగించారు

సాక్షి ఎఫెక్ట్..



తుప్పలు తొలగించిన తర్వాత విశాలంగా వెన్నలపాలెం రహదారి

పరవాడ: తంతడి-వెన్నలపాలెం రహదారిలోని వంతెనపై దట్టంగా పెరిగిన ముళ్ల పొదలను తొలగించారు. ముళ్ల పొదలతో అవస్థలు శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. వంతెనకు ఇరువైపులా దట్టంగా పెరిగిన తుప్పలు, పొదల కారణంగా రహదారిలో రాకపోకలు సాగించే కార్మికులు, ఉద్యోగులు, ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడేవారు. చీకటి పడితే మరిన్ని అవస్థలు ఎదుర్కొనేవారు. ఎట్టకేలకు వంతెనతో పాటు రహదారిలో పెరిగిన ముళ్ల పొదలను తొలగించడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

నాయనమ్మపాలెం పాలసొసైటీ కార్యవర్గం ఎన్నిక

సబ్బవరం: మండలంలోని నాయనమ్మపాలెం పాల సొసైటీ అధ్యక్షుడిగా గ్రామానికి చెందని గనిరెడ్డి రాము ఎన్నికయ్యారు.సొసైటీలో 84 మంది పాడి రైతులు ఉండగా శనివారం నిర్వహించిన ఎన్నికల్లో 80 మంది పాల్గొని నూతన పాల సొసైటీ కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు.డెయిరీ మేనేజర్ ప్రభాకర్ అధ్యక్షతన నూతన అధ్యక్షుడితో పాటు పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా ఎన్నికైన రామును ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు అభినందించారు. కార్యక్రమంలో డెయిరీ సూపర్ వైజర్ శ్రీనివాస్, ఇందల వెంకటరమణ,సర్పంచ్ గొంప నాయనప్ప,పైల రమణ,గవర శ్రీను,గెంజి సురేష్, గెంజి రాజు,మాటూరి అశోక్,బోకం స్వామినాయడు ,గవర వెంకటస్వామి తదితరులు ఉన్నారు.



రామును అభినందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తదితరులు

స్టీల్ సీఎండీతో 'సెఫీ' నేతల భేటీ

ఉక్కునగరం: స్టీల్ ఎగ్జిక్యూటివ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సెఫీ) నాయకులు శనివారం స్టీల్‌ప్లాంట్ సందర్శించారు. సెఫీ చైర్మన్ నరేంద్ర కుమార్ బంచోర్, ప్రధాన కార్యదర్శి అబాకస్ మల్లిక్, భిలాయ్ స్టీల్‌ప్లాంట్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పర్విందర్ సింగ్, సెఫీ కార్యవర్గ సభ్యులు ఉక్కు పర్యటనలో భాగంగా సీఎండీ అతుల్ భట్, డైరెక్టర్లు పాండే, జి.వి.ఎన్. ప్రసాద్, గణేష్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ అద్భుతమైన లేఅవుట్ కలిగి ఉందని, 20 మిలియన్ టన్నులకు విస్తరించడానికి అనుకూలంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సెఫీ, నేషనల్ కన్ఫెడరేషన్ ఆఫ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఎన్‌సీఓఎ) స్టీల్‌ప్లాంట్ సమస్యకు సెయిల్‌లో విలీనం చేయడమే పరిష్కారమన్నారు. ఉక్కు అధికారుల సమస్యలపై చర్చించారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ యు. శ్రీధర్, ఉన్నతాధికారులతో ప్లాంట్ ఉత్పత్తి గురించి మాట్లాడారు. అనంతరం ప్లాంట్‌లోని ఉత్పత్తి విభాగాలను సందర్శించి అక్కడ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో సీ నాయకులు కాటం చంద్రరావు, కేవీడీ ప్రసాద్, సీహెచ్. వెంకటేశ్వరరావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్‌ను కలిసిన సెఫీ నాయకులు

బైక్ ఢీ కొని వృద్ధుడి మృతి

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్, బీసీ రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. న్యూపోర్టు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ ఉమా మహేశ్వరరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, సరియాపల్లికి చెందిన జలుమూరు ఆనందరావు (65) దయాల్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. అతను కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే శుక్రవారం ఆయన కూలి పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం 7 గంటల సమయంలో ఇంటి వస్తూ..దయాల్‌నగర్ వద్ద బీసీ రోడ్డు దాటుతుండగా గాజువాక నుంచి పెదగంట్యాడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న కర్రి మోహన్‌రావు అనే యువకుడు ఢీకొట్టాడు. దీంతో ఆనందరావు రోడ్డుపై తుళ్లిపడ్డాడు. తలకు తీవ్రంగా గాయాలు కావడంతో వెంటనే అతడ్ని అగనంపూడి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాత్రి 9.30 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ ప్రమాద సంఘటనపై సమాచారం అందుకున్న న్యూపోర్టు ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన యువకుడ్ని అదుపులోకి తీసుకున్నారు. మృతుని కుమారుడు జలుమూరి సాయికిరణ్ ఫిర్యాదు మేర కు ఏఎస్‌ఐ ఉమా మహేశ్వరరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



జలుమూరి ఆనందరావు మృతదేహం

రూ.10 భోజనానికి 356 రోజులు

దాబాగార్డెన్స్ : వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రిలో దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్ సహాయకులకు రూ.10కే రుచికరమైన, శుభ్రమైన భోజనాన్ని స్వామి వివేకానంద సంస్థ ద్వారా ప్రతి రోజూ పంపిణీ చేస్తోంది. ఈ కార్యక్రమం శనివారం నాటికి 356 రోజులకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చిన పేషెంట్ల సహాయకులకు భోజనం చాలా అవసరమని, రౌండ్ టేబుల్ సంస్థ సభ్యుల సహకారంతో రూ.10కే భోజనాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తామని తెలిపారు. అన్నదాన కార్యక్రమాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రౌండ్ టేబుల్ సంస్థకు స్వామి వివేకానంద సంస్థ ఈ సందర్భంగా అభినందనలు తెలిపింది. కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు కల్యాణ్ ఆదిత్య, భరత్ కొల్లపూడి, స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



రూ.10 భోజనం పంపిణీ చేస్తున్న వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు

21న గురుపౌర్ణమి వేడుకలు

తాటిచెట్లపాలెం: రైల్వే న్యూకాలనీ ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 21న గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ధ్యాన మందిర వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు, త్రిపురాన రాంబాబు తెలిపారు. ధ్యాన మందిరంలో శనివారం వేడుకల కరపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ 21వ తేదీ ఉదయం నుంచి అభిషేకాలు, సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు అర్ధ ఏకాహం జరుగుతాయన్నారు. మధ్యాహ్నం మహా అన్నప్రసాదం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వీ డెంటల్ హాస్పిటల్ డైరెక్టర్ కె.ఎం.కె.రమేష్, ఆడిటర్స్ కె.నారాయణ, భుకారి మహ్మద్, ధ్యాన మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

20 నుంచి బాబా ఉత్సవాలు

అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద షిర్డీసాయి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు లక్ష్మీ సత్యనారాయణ ప్రసాద్, ప్రధాన అర్చకుడు హరి గోపాలశర్మ తెలిపారు. ఆలయ ఆవరణలో శనివారం మీడియా సమావేశంలో వీరు మాట్లాడారు. ఈ నెల 20న బాబా పల్లకీ సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 21వ తేదీ ఉదయం నుంచి అభిషేకాలు, ప్రత్యేక సుదర్శన హోమం, అన్నాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు.



గురుపౌర్ణమి వేడుకల కరపత్రికను ఆవిష్కరిస్తున్న ధ్యాన మందిర కమిటీ సభ్యులు